క్లుప్తంగా

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



బచ్చన్నపేట: గ్రామాల్లోని జీపీ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని జీపీల్లో ఇంటి, నల్లా పన్నులను వంద శాతం వసూలు చేయాలన్నారు. అలాగే ఈజీఎస్ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో స్థానికుడు, సామాజిక కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎండల దృష్ట్యా గ్రామస్తులు, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకులు మల్గ సిద్దిరాములు, సిద్దారెడ్డి, వెంకటయ్య, శ్రీకాంత్, అభినయ్, శ్రీనివాస్, కనుకరాజు, కిష్టయ్య, ఎల్లయ్య, రాజు పాల్గొన్నారు.

ఎన్నిక



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో మాదిగ(మహారాజ్) కుల సంఘం అధ్యక్షుడి ఎన్నికను బుధవారం నిర్వహించారు. కుల పెద్ద మనుషుల సమక్షంలో గ్రామానికి చెందిన మేడ ఉప్పలయ్యను కుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సింగపురం సురేందర్, ఎడ్ల సమ్మయ్య, గాదెపాక కుమార్, గట్టుమల్లు, చంద్రయ్య, రామస్వామి వెంకటేష్, మేడ సురేష్, అశోక్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ శుభలేఖ ఆవిష్కరణ



దేవరుప్పుల: ఈ నెల 17వ తేదీన మండలంలోని పెద్దమడూరు హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణ శుభలేఖలను పూజారి మోటకోదూరు శ్రీనివాసాశర్మ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఏటా లోకకల్యాణార్థం నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి 50 వసంతాలు పూర్తవుతున్నందున ఆధ్యాత్మిక చింతన కోసం అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దుబ్బ రాజశేఖర్, నల్ల ఉమేష్, జోగు భిక్షపతి, చంద్రగిరి కొమురయ్య, నాయకపు శ్రీను, పోకల రాము,బబ్బూరి రవి, పట్వారి శేఖర్, సందీప్, శివ, రంజిత్, రాజు, సాయి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో తొలగించిన భారీ వృక్షం



జనగామ రూరల్: జనగామ బస్టాండ్‌లో భారీ రావి చెట్టును బుధవారం అధికారులు తొలగించారు. 100 ఏళ్ల నుంచి ఎంతో మంది ప్రయాణికులకు చెట్టు నీడ నిచ్చింది. గతంలో చెట్టు చుట్టు మినీ పార్క్‌లా చేశారు. దానిని ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురైంది. అయితే బస్టాండ్ అభివృద్ధిలో భాగంగా రావి చెట్టును తొలగించినట్లు అధికారులు తెలిపారు.

పరామర్శ

పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ఎద్దు పొడిచి తీవ్రంగా గాయపడిన పీఏసీఎస్ చైర్మన్ గోనె మైసులును రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గంగు కృష్ణమూర్తి, పులి గణేష్ బుధవారం పరామర్శించారు. మైసులు ఆరోగ్యం త్వరగా మెరుగపడాలని కోరారు. గోనె దామోదర్ రెడ్డి, చిలువేరు బాలరాజు, గోనె కార్తీక్, సంపత్ పాల్గొన్నారు.

సమావేశాలకు అనుమతి తప్పనిసరి

- ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పరమైన సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఘన్‌పూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి, ఎన్నికల కోడ్‌లో పాటించాల్సిన అంశాలపై తగిన సలహాలు, సూచనలు అందించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, రాతలు తొలగించాలని, తిరిగి ఏ రాజకీయ పార్టీ ప్రకటనలు వేయరాదన్నారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలాంటి మైక్‌లు, డీజేలు, ప్రచార రథాలు నడపొద్దన్నారు. వాహనాలు, సమావేశాల కోసం అనుమతులకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు తదితర బృందాలు ఎన్నికల కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలన చేస్తాయని, ఎవరైనా ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవన్నారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనల్ని పాటిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాచర్ల గణేష్, తెల్లాకుల రామక్రిష్ణ, ఐలోని అంజిరెడ్డి, సట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

ఆశీర్వదిస్తే సేవకుడిలా పనిచేస్తా..

- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి

కొడకండ్ల: స్థానికుడినైన తనను మీ బిడ్డగా పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించి అవకాశమిస్తే మీ కష్టసుఖాల్లో పాలుపంచుకొంటూ నిత్యం అందుబాటులో ఉంటూ సేవకుడిలా పనిచేస్తానని బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మార్కండేయ భవనంలో శ్రీమాన్ అధ్యక్షతన జరిగిన కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల బూత్ కమిటీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి జరిగిందని, సుస్థిర, సమర్థ నీతివంతమైన పాలనతో దేశాన్ని అగ్రభాగాన ప్రధాని నిలుపాడని, ముచ్చటగా మూడోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, మోదీ టీంలో నేనుసైతం భాగస్వామ్యం కావాలనే సంకల్పంతో ముందుకొచ్చానని అన్నారు. సమావేశంలో బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, రాజేశ్వర్‌రావు, నాయకులు లేగ రామ్మోహన్‌రెడ్డి, మురళీధర్ గౌడ్, కుమారస్వామి, కోటేశ్వర్, కన్నయ్య, సోమన్న, ఉపేందర్, రాజశేఖర్, మహేందర్, సృజన్, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

నర్మెట: వేసవి ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీఓ అరవింద్ చౌదరి అన్నారు. మండల కేంద్ర గ్రామ పంచాయతీలో బుధవారం తనిఖీ నిర్వహించిన సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలు వంద శాతం చేయడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణలో శ్రద్ధ వహించాలని, విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సూచించారు. నెలలో మూడుసార్లు ట్యాంకుల్లో ఫ్లోరినేషన్ చేయడంతో పాటు నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలన్నారు. వృత్తి వ్యాపార లైసెన్స్‌లను ఈనెలాఖరులోగా రెన్యూవల్ చేయాలని కార్యదర్శి కంద కట్ల శ్రీధర్‌కు సూచించారు. ఆయన వెంట బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీఓ అరవింద్ చౌదరి

మోదీ మళ్లీ పీఎం అయితే పేదల బతుకులు ఆగం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే దేశంలోని పేదల బతుకులు ఆగం అవుతాయని, బీజేపీ దూకుడును అడ్డుకొనేందుకే కాంగ్రెస్‌లో చేరానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం నెల్లుట్లలో సమీపంలోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల ముఖ్యనాయకుల సమావేశం, లోక్‌సభ ఎన్నికల సన్నాహక సభ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పదేళ్లు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీతో ముస్లింలు, దళితులపై దాడులు జరుగుతున్నాయని, మరోసారి అధికారంలోనికి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్నారని, లౌకికవాదం లేకుండా చేస్తారని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితేనే దేశంలోని పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇందిర, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, జగదీశ్‌చందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, శివరాజ్ యాదవ్, ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సాదం మనోహర్, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సదానందం, దూసరి గణపతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయా గ్రామాల కార్యకర్తలను కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. చీటూరు, కళ్లెం గ్రామాల బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొనే క్రమంలో స్థానిక నాయకులతో గందరగోళం నెలకొనగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగి కొన్ని గ్రామాల కార్యకర్తలకు కండువాలు కప్పకుండానే నాయకులు వెళ్లిపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న కృష్ణమూర్తి



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు కోనేటి శ్రీను, కడవెండిలో సీనియర్ నాయకుడు సీతాల మల్లయ్య, భాషిపాక అంజయ్య, తీగారంలో బైకానీ శ్రీశైలంగౌడ్ మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఎసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎంపీటీసీ జాకీర్, ఉప్పుల ఉప్పలయ్య, రెడ్డిరాజుల రమేష్, గొరగాని ఐలేష్‌యాదవ్, తోటకూరి రమేష్,దామెర అనిల్, పల్లపు రవి, మహేందర్‌జీ, రాంబాబు, షబ్బీర్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో స్నేహితుడి కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి నడిమింటి బాలరాజు మృతి చెందగా అతనితో కలిసి చదువుకున్న టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 20 వేల సాయం బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కొప్పురపు రమేష్‌రెడ్డి, రజినీకాంత్, జూకంటి రాజు, చల్ల కిషన్, కందుకూరి రాజు, తాటికొండ ఉపేందర్, ఆలేటి రాజేందర్, ఎంటె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'అరూరిని భారీ మెజార్టీతో గెలిపించాలి'

జఫర్‌గఢ్: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్ కోరారు. ఈ మేరకు మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. బూత్ కమిటీ కోఆర్డినేటర్‌గా బుర్ర తిరుపతిగౌడ్, బూత్ అధ్యక్షుడిగా మూల యాకయ్యగౌడ్, బూత్ ప్రధాన కార్యదర్శిగా పొనుగోటి గోపాల్‌రావు, బూత్ కోఆర్డినేటర్‌గా నేరేళ్ల రాజు, నాయిని యాదగిరిగౌడ్, నల్ల యాలద్రిరెడ్డి, గాదెపాక శ్రీశాంత్, గద్దం రాజుగౌడ్, పులి రాజుగౌడ్, బైరి పవన్‌కుమార్‌గౌడ్, కోరుకొప్పుల లోకేష్‌గౌడ్‌తో పాటు తదితరులు నియమించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అవరణలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఓటరు లిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. ఓటరు లిస్టులు తప్పిదాలుంటే సరిచేసుకోవాలన్నారు. ఆర్‌ఐ అనిల్ బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌తో పాటు బీఎల్‌ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఇఫ్తార్ విందు

దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డిగూడెం మజీదు వద్ద పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గులాం రసూల్, ఎంపీటీసీ జాకీర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మతగురువు ఇనాయిత్ రసూల్ ప్రత్యేక ప్రార్థనలు చేసి అల్లా ఆశీస్సులు అందించారు. శ్రీరాములు, కృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు నాయకులు

ఉప్పలయ్యకు అంతిమవీడ్కోలు

దేవరుప్పుల: టీపీసీసీ మాజీ సభ్యుడు, బ్లాక్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కోతి ఉప్పలయ్య అంత్యక్రియలు రాజకీయాలకతీతంగా అశ్రునయనాల మధ్య అన్ని పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని అంతిమవీడ్కోలు పలికారు. బుధవారం మండలంలోని కోలుకొండలో ఉప్పలయ్య మృతదేహానికి ఫైనాన్స్, ఆయిల్‌సీడ్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్లు సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పార్టీల మండల ప్రతినిధులు నల్ల శ్రీరాములు, పెద్ది కృష్ణమూర్తి, పల్ల సుందర్‌రామిరెడ్డి, బిల్లా తిరుపతిరెడ్డి, పలు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలతో ఘననివాళులర్పించారు. మృతుడి భార్య మాజీ ఎంపీటీసీ కోతి అనసూయతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాల పాటు తనదైన శైలిలో రాజకీయ ముద్ర వేసుకున్న ఉప్పలన్న మరణం అన్ని వర్గాల ప్రజలకు తీరనిలోటని తీవ్రవిచారం వ్యక్తం చేశారు.



పాడె మోస్తున్న సిరిసిల్ల రాజయ్య

కడియం కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: బ్లాక్ కాంగ్రెస్ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ నాగరబోయిన శ్రీరాములు ఆధ్వర్యంలో మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. నాయకులు సూదుల రత్నాకర్‌రెడ్డి, వడ్లకొండ రవి, పొన్నం రాజు, జోగు కుమార్, కాసాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఛాగల్లుకు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి హనుమకొండలో కడియం కావ్యను కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'ఎమ్మెల్యే పదవికి కడియం రాజీనామా చేసి గెలవాలి'



మాట్లాడుతున్న కమలాకర్‌గౌడ్

రఘునాథపల్లి: తన స్వార్థం కోసం తల్లిలాంటి పార్టీని వీడి బీఆర్‌ఎస్ కార్యకర్తలను మోసం చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి దమ్ముంటే పదవికి రాజీనామా కాంగ్రెస్ బీఫాంపై గెలవాలని బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కుర్ర కమలాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అశ్వరావుపల్లిలో నిర్వహించిన యువజన విభాగం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పదవులు అనుభవించి, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లడం అవకాశవాద రాజకీయానికి నిదర్శనమన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో తన కూతురుకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ యూత్ నాయకులు నీల భాస్కర్, కుర్ర నవీన్, మంద రమాకాంత్, ఐలోని మురళి, కన్నారపు యాదగిరి, నీల నాగరాజు, నీల ఎల్లేష్, నీల వెంకటేష్, జెనిగల వెంకటేష్, ముప్పిడి సాంబ, రాజు, లింగం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘం భవన నిర్మాణానికి విరాళం



సంఘం సభ్యులతో జితేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో శాలివాహన సంఘం భవన నిర్మాణానికి గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు ఇమ్మడి జితేందర్‌రెడ్డి రూ. 30వేల విరాళం బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతున్నానన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్‌గుప్తా, నాయకులు ఎల్లయ్య, ఐలయ్య, బాల్‌నర్సయ్య, కృష్ణ, రాములు, నర్సింహులు, నాగరాజు, సత్తయ్య, యాదగిరి, కిష్టయ్య, గాలి తిరుపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



బచ్చన్నపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రతీ బుధవారం అంగన్ వాడీ కేంద్రాల తనిఖీ కార్యక్రమంలో భాగంగా వాటిని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే చిన్నారులకు పెట్టే ఆహార పదార్థాలను, గుడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం

- నాలుగేళ్లైనా మొదలుకాని పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో 2021 అక్టోబర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శిలా ఫలకం వేసి శంకుస్థాపన మరిచారు. గ్రామ ప్రజలకు అన్ని వసతులతో కూడిన ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి స్థలం చూపిస్తే నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అప్పటి సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డితో పాటు రాజకీయ పార్టీ నాయకులు మొదట శ్రీరాంపల్లె వద్ద స్థలం చూశారు. ఆ సమయంలో నిధుల మంజూరుకు ఆలస్యం కావడంతో స్థలం ఇచ్చిన వ్యక్తి విక్రయించాడు. అనంతరం గ్రామ పంచాయతీ సమీపంలో స్థానికుడు గొట్టం విజయపాల్ రెడ్డి 30 గుంటల స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి నాలుగు ఏళ్ల క్రితం రూ. 16 లక్షలు మంజూరు చేశారు. కాగా, అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు యుద్ధ ప్రాతిపదికన తేదీ లేకుండా శిలాఫలకం వేయించారు. అప్పటి నుంచి అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. చివరకు భవనం నిర్మిస్తే మంజూరైన నిధులు సరిపోవని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో నాలుగేళ్లుగా అక్కడ శిలాఫలకమే కనిపిస్తోంది. సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



నాలుగేళ్ల క్రితం తేదీ లేకుండా వేసిన శిలాఫలకం

శివునిపల్లిలో కోతుల బెడద

- భయాందోళనలో ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో ఇటీవల కోతుల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వానరాలు నీటి కోసం జనవాసాల్లోకి వస్తున్నాయి. గ్రామంలో ఇళ్లలో ఉన్న చింతచెట్లు, జామచెట్లు, మామిడి తదితర చెట్లపై నానా హైరానా చేస్తూ ఆయా చెట్లకు కాసిన కాయలను ధ్వంసం చేస్తున్నాయి. అదేవిధంగా ఇళ్లలోకి వస్తూ ఇంట్లో ఉన్న బియ్యం తదితర వస్తువులను చిందరవందరగా చేస్తున్నాయి. దాహం తీర్చుకునేందుకు ఇళ్లపై ఉండే వాటర్ ట్యాంకుల్లో సర్కస్‌ఫీట్లు చేస్తూ జలకాలు ఆడుతున్నాయి. కోతులు ఒక్కసారిగా గుంపులుగుంపులుగా వస్తుండగా ప్రజలు ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకుంటున్నారు. ఇదే అదనుగా కోతుల గుంపు నానా హంగామా చేస్తున్నాయి. విపరీతంగా చెట్లను నరికివేయడం, అడవులు లేకపోవడంతో ఎండాకాలంలో నిలువ నీడ, నీటి సౌకర్యం లేక కోతులు జనవాసాల్లోకి వస్తున్నాయి. ఈ విషయమై గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కోతలు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వానరాల గుంపు